పందికోన రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

'అన్నదాత సుఖీభవ'

అందరికీ అందేనా..?

- నేడు రైతుల ఖాతాల్లో నిధులు జమ - కౌలు రైతులకు మొండి చేయి - పెదవి విరుస్తున్న రైతు సంఘాలు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం శనివారం ప్రారంభించనున్న అన్నదాత సుఖీభవ పథకం రైతులందరికీ అందేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీల్లో ఒక్కటైన అన్నదాతా సుఖీభవ పథకం నేడు ప్రారంభం కానుంది. కౌలు రైతులకు అన్నదాత సుఖీభవలో మొండిచేయి చూపుతున్నారు. దీనిపై రైతులు, రైతు సంఘాల నాయకులు పెదవి విరుస్తున్నారు...

మొదటి విడతగా రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు, పిఎం కిసాన్ కింద కేంద్ర ప్రభుత్వం వాటా రూ.2 వేలు చొప్పున శనివారం రైతుల ఖాతాల్లో జమ కానుంది. మిగిలిన సొమ్ము మళ్లీ అక్టోబర్‌లో రెండో విడతగా, మూడో విడత జనవరిలో రైతుల ఖాతాల్లో జమ కానుంది. అయితే ఎన్నికల ముందు చెప్పిన ప్రకారం కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద ఇస్తామన్న సొమ్మును మొత్తం చెల్లించకుండా విడతల వారీగా రైతుల ఖాతాల్లో జమ చేస్తూ తీసుకున్న నిర్ణయం పట్ల రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఒకేసారి పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం మాట తప్పుతుందనే విమర్శలను ఎదుర్కొంటుంది. ఎన్నికల ముందు మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే పెట్టుబడి సాయం రైతులకు అందజేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు మాత్రం పీఎం కిసాన్ కింద వచ్చే అమౌంట్ ను కలిపి మూడు విడతలుగా 20 వేలు ఇస్తామని చెప్పడం పట్ల రైతులు పెదవి విరుస్తున్నారు. కర్నూలు జిల్లా మొత్తం మీద 2 లక్షల 75 వేల 749 మంది రైతులకు ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. అందులో 2,107 మంది రైతులకు ఈ-కెవైసి పెండింగ్ ఉంది. కౌతాళం 258, హాలహర్వి 195, చిప్పగిరి 182, పత్తికొండ 180, ఆలూరు 172 పెండింగ్‌లో ఉన్నాయి. ఎన్‌పిసిఐ మ్యాపింగ్ కాని రైతులు 8,755 మంది ఉన్నారు. అందులో ఆదోని, దేవనకొండ, కృష్ణగిరి, కౌతాళం మండలాల్లో ఎక్కువగా ఉన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో కౌలు రైతులకు మొదటి విడతలో మొండి చేయి చూపించనుంది. ఈ విడతలో వారి ఖాతాల్లో పెట్టుబడి సాయాన్ని వేయకపోవడంతో కౌలు రైతులు ప్రభుత్వంపై గుర్రుగా ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 40 వేల నుండి 50 వేల మంది వరకు కౌలు రైతులు ఉన్నారు. వీరందరికి కౌలు రైతు గుర్తింపు కార్డులు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు 30 శాతం మందికి మత్రమే కార్డులు ఇచ్చారు. కార్డులు లేని వారికి ప్రస్తుతం సొమ్ము జమ చేయకపోవడంతో కౌలు రైతులు పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

మాట మార్చిన ముఖ్యమంత్రి



ఎన్నికల కంటే ముందు రైతుల ఓట్ల కోసం పెట్టుబడి సహాయంగా రూ.20 వేలు ఇస్తామని చెప్పిన చంద్రబాబు, ఎన్నికలలో గెలిచిన తర్వాత ఒక సంవత్సరం ఖరీఫ్, రబీ పంటలు అయిపోయినా నయా పైసా ఇవ్వలేదు. సంవత్సరం తర్వాత ఇస్తామన్న సహాయం కూడా జనవరి నుండి కాలయాపన జరిపి చివరకు ఒకే దఫాలో రూ.20 వేలు ఇవ్వకుండా, మూడు దఫాలుగా చెల్లిస్తామని చెప్పడం చూస్తుంటే ఓడ ఎక్కక ముందు మల్లన్న ఓడ దిగిన తర్వాత బోడి మల్లన్న అన్న చందంగా ఎన్నికల అవసరాలు తీరాక మూడు దఫాలుగా ఇస్తామని చెప్పడం రైతుల్ని మోసం చేయడమే. ఒప్పుకున్న మేరకు రూ.20 వేలు ఒకే సారి ఇస్తే రైతులందరికీ సకాలంలో పెట్టుబడికి అందుతుంది. అది కాకుండా కేంద్రం ఇచ్చే నిధులతో కలుపుకొని రూ.20 వేలు మూడు దఫాలుగా ఇస్తామనడం చాలా అన్యాయం.

- జి.రామకృష్ణ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి.

ఈ కెవైసి, మ్యాపింగ్ కానివారు చేయించుకోవాలి

- కలెక్టర్ రంజిత్ బాషా

ఈ కేవైసీ, ఎన్‌సిపిఐ మ్యాపింగ్ కాని రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి ఈ-కెవైసి, మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయించుకోవాలని చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ రైతులకు విజ్ఞప్తి చేశారు. మీ సేవా కేంద్రాలు లేదా సెక్రటేరియట్లకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు. అలాగే ఎన్పీసీఐ మ్యాపింగ్ కాని వారు బ్యాంకుకు వెళ్లి వాళ్ళ అకౌంట్ తో ఆధార్ మ్యాపింగ్ చేయించుకోవాలని కలెక్టర్ రైతులకు సూచించారు.

కరెంటు చార్జీలు తగ్గించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

అదానీ స్మార్ట్ మీటరు మాకు వద్దు కరెంటు చార్జీలు తగ్గించాలని కోరుతూ కార్మికులతో సంతకాల సేకరణ, ఆగస్టు 5న కరెంటు సబ్ స్టేషన్ల ఆఫీసుల ముందు జరుగు ధర్నాను జయప్రదం చేయండి సిఐటియు నగర అధ్యక్షులు ఆర్. నరసింహులు కార్మికులకును కోరారు. కర్నూలు ప్రజా సంఘాల ఐక్యవేదిక ఇచ్చిన పిలుపులో భాగంగా సిఐటియు న్యూ సిటీ కమిటీ ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ దగ్గర ఉన్న వేరే హౌస్ హమాలీ కార్మికుల చేత సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేర్ హౌస్ హమాలీ యూనియన్ అధ్యక్షులు విష్ణుమూర్తి అధ్యక్షత వహించారు. సిఐటియు నగరఅధ్యక్షులు ఆర్ నరసింహులు, వేర్ హౌస్ హమాలీ యూనియన్ కార్యదర్శి ఎం.మల్లికార్జున గారులు సంతకాల సేకరణ కార్యక్రమం సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ ఆదానితో చేతులు కలిపి ప్రజల పైన విద్యుత్ భారాలు విపరీతంగా వేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సంతకాల సేకరణ కార్యక్రమం యూనియన్ నాయకులు ఇ. విజయుడు, టికె మధు ఇసాక్ సామేలు మధు చిన్న మద్దిలేటి శేఖర్ చెన్నయ్య పాల్గొన్నారు.



సంతకాల సేకరణ చేస్తున్న నాయకులు

హరికిషన్ సింగ్ సూర్జిత్‌కు ఘననివాళి

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

పాతబస్తీ సిపిఎం కార్యాలయంలో సిపిఎం అఖిల భారత నేత హరికిషన్ సింగ్ సుర్జీత్ 17వ వర్ధంతి సభను నిర్వహించారు. 12 సంవత్సరాల వయస్సులో బ్రిటిష్ పాలనకు వ్యతిరేఖంగా పోరాటం చేసి, లాఠీల దెబ్బలు, బుల్లెట్ల మోతల మధ్య బ్రిటిష్ జెండాను తొలిగించి.. జాతీయ జెండాను ఎగరేసిన ధీరుడు హరికిషన్ సింగ్ సుర్జీత్ సిపిఎం నగర కార్యదర్శి ఎం రాజశేఖర్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు, ఎస్ఎండి.షరీఫ్, డి.అబ్దుల్ దేశాయ్‌లు కొనియాడారు. హరికిషన్ సింగ్ సుర్జీత్ 17వ వర్ధంతి సభ సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. సిపిఎం నగర నాయకులు మద్దిలేటి, రాంబాబు, శ్రీనివాసులు షేక్షా వలి, కుమార్, నాగరాజు, బజారి, బాలు, వేణు, విజయ్, సురేష్ రాజు పాల్గొన్నారు.

పందికోన రిజర్వాయర్‌కు రూ.210 కోట్లతో ప్రతిపాదనలు

-ఈ ఏడాది అన్ని చెరువులను నింపుతాం -తాగునీటి సమస్య లేకుండా చేస్తాం.. -జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-పత్తికొండ

పందికోన రిజర్వాయర్‌కు సంబంధించి పెండింగ్ పనులు చేపట్టేందుకు రూ.210 కోట్లతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం పత్తికొండ మండలం దూదేకొండ సమీపంలో ఉన్న పందికోన రిజర్వాయర్‌ను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యామ్‌బాబు పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పందికోన రిజర్వాయర్‌కు సంబంధించిన పెండింగ్ పనులు పూర్తి అయితే అదనంగా 40 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. చుట్టుపక్కల గ్రామాల్లో తాగునీటి సమస్యను కూడా తీర్చవచ్చునని తెలిపారు. ఈ అంశం గురించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళ్ళామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో నిలిచిపోయిన ఆర్‌డిఎస్ వేదవతి ప్రాజెక్టు పనులను కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. జిల్లాలో హెచ్ఎన్ఎస్ఎస్ కెనాల్ వెడల్పు పనులు పూర్తి చేశామని, గతంలో 2100 క్యూసెక్కుల నీటి సామర్థ్యం ఉన్న కాలువను 3500 క్యూసెక్కులు నీటి సామర్థ్యం పెంచేలా వెడల్పు చేశామన్నారు. హంద్రీ నీవా నీటితో జిల్లాలోని చెరువులను పూర్తి స్థాయిలో నింపి, తాగునీరు సమస్య రాకుండా చేశామన్నారు. గత ఏడాది లాగానే, ఈ ఏడాది కూడా అన్ని చెరువులను నీటితో నింపి తాగునీటి సమస్య లేకుండా చేస్తామని కలెక్టర్ తెలిపారు. పత్తికొండ ఆర్‌డిఒ భరత్ నాయక్, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఇ పాండురంగయ్య, ఇఇ గుణకర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ఎన్.ప్రసాద్‌రావు, తహాశీల్దార్ హుస్సేన్ సాహెబ్, ఎంపిడిఒ కవిత పాల్గొన్నారు..

2,39,491 మందికి రూ.103.97 కోట్ల పింఛన్లు పంపిణీ

జిల్లాలో 2,39,491 మందికి రూ.103.97 కోట్ల పింఛన్లు పంపిణీ చేశామని, ఎన్‌టిఆర్ భరోసా పథకం పింఛన్లకింద జిల్లాలో 3,502 మందికి వితంతువులకు కొత్తగా పింఛన్లు మంజూరు చేసి, ఇందు కోసం పెన్షన్ మొత్తం రూ.1.40 కోట్లు పంపిణీ చేశామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో భాగంగా పత్తికొండ మండలం దూదేకొండ గ్రామంలో గౌరమ్మ, రామాంజినమ్మ, షేకమ్మ, సంజమ్మ, రంగమ్మ, మద్దిలేటమ్మ లకు వితంతువు పింఛన్లు వారి ఇంటి వద్దకే వెళ్లి కలెక్టర్, పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యామ్ కుమార్ అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు మాసంలో జిల్లాలో అర్హులైన 2 లక్షల 39 వేల 491 మంది పెన్షన్ లబ్ధిదారులకు రూ.103.97 కోట్లు పంపిణీ చేశామన్నారు. ప్రతినెల 1వ తేదీన సరైన సమయంలో అత్యధిక భాగం పెన్షన్ పంపిణీ మన జిల్లాలోనే చేస్తున్నామన్నారు. భర్త పెన్షన్ తీసుకుంటూ మరణించినట్లయితే వెంటనే వితంతువు పెన్షన్ ఇచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. జిల్లాలో కొత్తగా 3,502 మందికి వితంతువులకు పెన్షన్ లు మంజూరు చేసి పంపిణీ చేశామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 2583 మందికి, పట్టణ ప్రాంతాల్లో 919 మందికి కొత్తగా వితంతు పింఛన్లు మంజూరు అయ్యాయని కలెక్టర్ తెలిపారు. లబ్ధిదారులకు పెన్షన్ లను పంపిణీ చేస్తూ కలెక్టర్, ఎమ్మెల్యే వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.. అక్కడే ఉన్న కొంతమంది తమకు పెన్షన్ రావడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వారి నుండి దరఖాస్తులు తీసుకొని, తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు.

మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలి

పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పత్తికొండ మండలం దూదేకొండ గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ హై స్కూల్ ను జిల్లా కలెక్టర్, పత్తికొండ ఎమ్మెల్యే తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన, మధ్యాహ్న భోజనం, పుస్తకాల పంపిణీ గురించి ఆరా తీశారు. 6 వ తరగతి విద్యార్థులతో ముచ్చటిస్తూ ప్రతి రోజు మీకు మెనూ ప్రకారంగా భోజనం పెడుతున్నారా? మీరందరూ ప్రతి రోజు ఇక్కడే భోజనం చేస్తున్నారా? భోజనం రుచిగా ఉందా? యూనిఫాం లు, నోట్ బుక్స్, టెక్స్ట్ బుక్స్, షూస్ ఇచ్చారా? టీచర్లు పాఠాలు ఏ విధంగా చెబుతున్నారని కలెక్టర్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు... 4వ తరగతి గదికి వెళ్ళి పిల్లలకు ఇంగ్లీష్ పాఠాలు బోధించారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. అనంతరం కలెక్టర్ వంట గదిని పరిశీలిస్తూ భోజనం రుచికరంగా ఉండేలా చేయాలని వంట సిబ్బందిని ఆదేశించారు. కట్టెల పొయ్యితో వంట చేయడం చూసి గ్యాస్ స్టవ్ తెప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. పత్తికొండ ఆర్‌డిఒ భరత్ నాయక్, డిఆర్‌డిఎ పిడి రమణారెడ్డి, తహాశీల్దార్ హుస్సేన్ సాహెబ్, ఎంపిడిఒ కవిత, తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ నెలాఖరుకు ఇంటిగ్రేటెడ్ టమోటా ప్రాసెసింగ్ యూనిట్

నవంబర్ నెల చివరి నాటికి ఇంటిగ్రేటెడ్ టమోటా ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణపు పనులను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను, కాంట్రాక్టర్ ను ఆదేశించారు. శుక్రవారం పత్తికొండ మండలం, దూదేకొండ రెవెన్యూ గ్రామం, కోతిరాళ్ళ గ్రామ పంచాయతీ వద్ద ఇంటిగ్రేటెడ్ టమోటా ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణపు పనులను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, పత్తికొండ ఎమ్మెల్యే కె.ఈ శ్యామ్ కుమార్ పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ టమోటా ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణపు పనులు బేస్మెంట్ లెవెల్ పూర్తయి, పిల్లర్ స్థాయికి వచ్చాయన్నారు.. ఆగస్టు చివరి నాటికి సివిల్ స్ట్రక్చర్ పనులను పూర్తి చేసి, నవంబర్‌లోపు మిషనరీతో సహా యూనిట్ అందుబాటులోకి రావాలన్నారు. టమోటా ప్రాసెసింగ్ యూనిట్ వద్దకు వెళ్లేందుకు ఉపాధి హామీ నిధుల కింద సిసిరోడ్ నిర్మాణం కూడా చేయించాలని కలెక్టర్ పత్తికొండ ఆర్‌డిఒను ఆదేశించారు. పత్తికొండ ఆర్‌డిఒ భరత్ నాయక్, తహాశీల్దార్ హుస్సేన్ సాహెబ్, ఎంపిడిఒ కవిత, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పత్రిక ప్రజాశక్తి

- ప్రజాస్వామ్యానికి మార్గదర్శి - పారదర్శకత పాటించే పత్రిక - ప్రజాశక్తి 45వ వార్షికోత్సవంలో వక్తలు వెల్లడి

ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ ప్రత్యేక అనుబంధంను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత, మేయర్ బివై రామయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, శమంతకమణి, పుల్లయ్య, డాక్టర్ శంకర్ శర్మ, సురేష్ కుమార్, మన్సూర్ రహెమాన్, టి.నరసింహ తదితరులు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

నిత్యం ప్రజల పక్షాన ఉంటూ సమస్యలను వెలికి తీసి అధికారులు, ప్రభుత్వం ముందు ఉంచే ప్రజల పత్రిక ప్రజాశక్తి అని పలువురు వక్తలు అన్నారు. ప్రజాశక్తి 45వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కర్నూలు నగరంలోని జిల్లా పరిషత్తు ప్రాంగణంలో ఉన్న ఎంపిపి హాల్లో వార్షికోత్సవ సభ ప్రజాశక్తి జనరల్ మేనేజర్ టి.నరసింహ అధ్యక్షతన నిర్వహించారు.

పత్రికలు ప్రభుత్వాలకు వారధులు : పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

పత్రికలు ప్రజలకు ప్రభుత్వానికి వారదిగా నిలుస్తాయని అన్నారు. సమస్యలను త్రికాలంలో జరిగే ఘటనలను ప్రజలకు చేరవేస్తుంది. పెరుగుతున్న జనాభాతో పార్టీ సమస్యలు పెరుగుతున్నాయి. టెక్నాలజీ కూడా పెరుగుతోంది. ప్రజా సమస్యలను నిక్కచ్చి తత్వంతో నిష్పక్షపాతంగా వార్తలుగా రాసేపత్రిక ప్రజాశక్తి. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల్లో ఎలాంటి లోటుపాట్లు ఉన్న వాటిని ఎప్పటికప్పుడు ఎత్తిచూపి సరి చేసే అవకాశం కల్పిస్తుంది.

ప్రజాశక్తి వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

పత్రిక నడపడం సాహసోపేతమైన పని

- మేయర్ బివై.రామయ్య.

45 ఏళ్ల పాటు ఒక పత్రిక నడపడం అంటే ఎంతో సాహసోపేతమైన చర్య అన్నారు. దృఢమైన సంకల్పం ఉంటే తప్ప అది సాధ్యం కాదు. ప్రజాశక్తి యాజమాన్యం సిబ్బంది కృషిని ఆ అభినందిస్తున్నా. శత వసంతాలు పూర్తి చేసుకోవాలని ఆకాంక్షిస్తున్నా.

మీడియాపై పాలకు అజమాయిషీ

- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్.

మీడియాపైన పాలకవర్గాల అజమాయిషి పెరిగింది. 2014 తర్వాత ఈ దాడి మరింత పెరిగి ప్రజాస్వామ్యాన్ని ఆపదలో పడేసింది. ఎన్‌డిటివి లాంటి గొప్ప ప్రజాస్వామ్య విలువలు ఉన్న మీడియాను తన యాజమాన్యానికి తెలియకుండానే పాలకవర్గం యాజమాన్య హక్కులను కాజేసింది. కారల్‌మార్క్స్ లాంటివారు సైతం జర్నలిస్టుగా పనిచేశారని గుర్తు చేశారు. వర్గ దృక్పథాన్ని అనుసరిస్తూ ప్రజాశక్తి నడుస్తోంది.

ప్రజాశక్తి చదివితే స్పష్టత వస్తుంది

- ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్టు శంకర్ శర్మ

మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా నాలుగో స్తంభంగా ఉందన్నారు. సమాజాన్ని అద్దం పట్టి చూపే శక్తి మీడియాకు ఉందన్నారు. సోషల్ మీడియాను బస్మాసుర హస్తంతో పోల్చారు. అందులో న్యూస్ ఉండదు వ్యూస్ మాత్రమే ఉంటాయన్నారు. ప్రజాశక్తిని చదివితే ఖచ్చితమైన అవగాహన వస్తుందన్నారు. మీడియాకు సమాచారం ప్రజలకు వేయడం ప్రభుత్వ పారదర్శకతను ప్రజలకు చూపడం ప్రజల అభిప్రాయాలను తెలియజేయడం, ప్రజల హక్కుల పై చైతన్యాన్ని కలిగించడం, నేరాలను గుర్తించడం విశ్లేషించడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఇది ప్రజాశక్తి చేస్తుందన్నారు.

ప్రజల సహకారంతో నడుస్తున్న పత్రిక

- రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య

డిజిటల్ మీడియా విస్తరిస్తున్న నేపథ్యంలో పత్రికల మనుగడ కష్టమైంది. అలాంటి సమయంలో కూడా ప్రజాశక్తి ముున్ముందుకు వెళ్లడం అభినందనీయం. దీనికి ప్రధానంగా ప్రజల సహకారమే కారణం. అందుకే ఇది ప్రజాశక్తి అయింది. ప్రజాశక్తి సిబ్బందితో తనకు ప్రత్యేక అనుబంధం ఉంది.

నిజాలు రాసే పత్రిక ప్రజాశక్తి

- కర్నూలు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నగరూరు శమంతకమణి

ప్రజాశక్తి మాకు ఉత్తేజాన్ని నింపుతుంది. ఉన్నది ఉన్నట్లుగా దేనికి భయపడక నిర్భయంగా రాసే పత్రిక. జిల్లాలో సుదీర్ఘకాలంగా గుండ్రేవుల, వేదవతి, ఆర్‌డిఎస్ వంటి ప్రాజెక్టుల పూర్తికి ప్రభుత్వాన్ని కదిలించేలా కథనాలు రాయాలి. మహిళలకు భద్రత ప్రజల్లో అవగాహనకల్పించాలి. పాలకులను కార్యోన్ముకులను చేయాలి.

కష్టాలను అధిగమించి ముందు నడుస్తున్న పత్రిక

- ప్రముఖ ఆర్థిక విశ్లేషకులు మన్సూర్ రెహమాన్

ప్రజాశక్తి అర్ధ శతాబ్దికి చేరువవుతుండడం అభినందనీయం. ప్రజాశక్తి కష్టాలను ఎదురీదుతూ ముందుకెళ్తుంది. ఇతర పత్రికల్లో సమస్య మాత్రమే కనిపిస్తుంది. ప్రజాశక్తిలో సమస్యతో పాటు సమస్య తీవ్రత కూడా కనిపిస్తోంది. ఇది ప్రజాశక్తి ప్రత్యేకం. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే బాధ్యతలో జ్యుడీషియరీ తరువాత మీడియా పైనే అత్యంత బాధ్యత ఉంది. ప్రస్తుతం ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతోంది. అందుకు మీడియాపై దాడి అర్థమవుతుంది.

అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోంది.

యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్



30 ఏళ్లుగా తాను పాఠకునిగా ఉన్నానన్నారు. ఎమర్జెన్సీ సమయంలో పత్రికల్లో సెన్సార్ షిప్ పాలక ప్రభుత్వాలు చేపట్టాయి. నేడు అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తుంది. దానితోపాటే మీడియాలో కూడా అప్రకటితో సెన్సార్షిప్ నడుస్తుంది. రాజ్యాంగ లక్ష్యాలను ప్రజల వద్దకు తీసుకెళ్లే మొదటి పత్రిక ప్రజాశక్తి. ప్రజా సమస్యలు ఉన్నంతకాలం ప్రజాశక్తి ఉంటుంది.

వివరణాత్మక విశ్లేషణల పత్రిక ప్రజాశక్తి

- క్రెడాయ్ కన్వీనర్ నగరూరు శ్రీనివాసరావు

ప్రజల తరపున నిలబడే కొన్ని పత్రికలలో ప్రజాశక్తి మొదటి స్థానంలో ఉంటుంది. డిజిటల్ సామాజిక మాధ్యమాలు వచ్చాక గందరగోళం కూడా పెరిగింది. ఆ గందరగోళాన్ని తొలగించి వివరణాత్మక విశ్లేషణను అందించేది ప్రజాశక్తి.

ప్రజల్లోకి విస్తృతంగా పోవాలి

- ఆర్ఐఒలాలప్ప

ఆర్ఐఒ లాలప్ప మాట్లాడుతూ.. ప్రజాశక్తి సర్క్యులేషన్ పెరగాలి. అందరూ అందుకు సహకరించాలి. అప్పుడే మరిన్ని నిజాలు ప్రజలకు చేరువవుతాయి.

ప్రజపక్షాలన నిలిచిన పత్రిక

అవధాని అవధాని, తెలుగు కవి హర్ష

ఏ పక్షానికి లొంగక, కేవలం ప్రజల పక్షాన నిలిచిన పత్రికా ప్రజాశక్తి. రక్తాన్ని చెమటగా మార్చి నిజాయితీని సిరాగా చేసి రాసే పత్రిక. ప్రజా సంఘర్షణ, అణచివేత ఉన్నంతకాలం ప్రజాశక్తి ఉంటుంది. ప్రజలను చైతన్య పరచడం కొలమానమైతే ఎప్పటికీ ప్రజాశక్తి మొదటి స్థానంలో ఉంటుంది. కూరగాయలు అందరూ ఏరుకుంటారని, కొందరే వజ్రాలు ఏరుతారు. వజ్రాల లాంటి వార్తలను ఏర్చికూర్చి రాసే పత్రిక ప్రజాశక్తి. ప్రభుత్వ ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపల్ నాగస్వామి నాయక్, విష్ణు టౌన్‌షిప్ అధినేత ఎన్.రాఘవేందర్ ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొని వారి సందేశాన్నిచ్చారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.అలివేలు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్లా, రంగప్ప ప్రజాశక్తికి వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. డెస్క్ ఇంచార్జి పానుగంటి చంద్రయ్య వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో ప్రజాశక్తి ప్రతినిధి ఎంయు వినయ్ కుమార్, ఎడిషన్ కమిటీ సభ్యులు ఎం.రాజు, ఎస్ఎడిబాష, మంగయ్య, ఎల్లాగౌడు, అకౌంటెంట్ జయలక్ష్మి, సబ్ ఎడిటర్లు మాసుంబాష, అయ్యస్వామి, పద్మావతి, డిజైనర్లు రాము, రాంప్రసాద్, మాసుం, రాజశేఖర్, ప్రజాశక్తి విలేకరులు సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాఘవేందర్

ప్రజాశక్తి ఆదోని ఏజెంట్ వీరన్నను అభినందిస్తున్న డాక్టర్ శంకర్ శర్మ, జి.పుల్లయ్య, గౌస్‌దేశాయ్, శమంతకమణి, నరసింహ తదితరులు

సమస్యలు తెలుసుకుంటున్న ఛైర్మన్ లోకేశ్వరి

పాఠశాల ఆవరణలోనే వంట చేయాలి

- మున్సిపల్ ఛైర్మన్ లోకేశ్వరి, కమిషనర్ కృష్ణ

ప్రజాశక్తి - ఆదోని

పాఠశాల ఆవరణలోనే మధ్యాహ్న భోజనం తయారు చేసి విద్యార్థులకు వడ్డించాలని, ఇళ్ల దగ్గర చేస్తే ఎలా అంటూ మున్సిపల్ ఛైర్మన్ సిహెచ్.లోకేశ్వరి ప్రశ్నిం చారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కృష్ణతో కలిసి పట్టణంలోని కల్లుబావిలోని ప్రకాష్ నగర్ మున్సిపల్ పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల సంఖ్య, వారికి ఎదురవుతున్న సమస్యలను ప్రధానోపాధ్యాయులు గిరిబాబును అడిగి తెలుసుకున్నారు. గదుల కొరత ఉందని, ఆర్ఒ ప్లాంట్ ద్వారా సరఫరా అవుతున్న నీరు సరిపోవడం లేదని ప్రధానోపాధ్యాయులు గిరిబాబు వారి దృష్టికి తెచ్చారు. 9వ తరగతి వరకు కొనసాగుతున్న పాఠశాలలో 510 మంది విద్యార్థులు ఉన్నారని, సంఖకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేరని ఛైర్మన్ తెలిపారు. ఉపాధ్యాయుల కొరత ఉందని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని, మెనూ ప్రకారము వంటకాలు తయారు చేయాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇబ్బంది పెడితే చర్యలు

- మూడో పట్టణ సిఐ రామలింగప్ప - వడ్డీ వ్యాపారి ఇంట్లో సోదాలు

ప్రజాశక్తి - ఆదోని

సోదాలు చేస్తున్న పోలీసులు

నిబంధనలకు విరుద్ధంగా వడ్డీ వ్యాపారాలు చేస్తూ సామాన్యులను ఇబ్బందులకు గురి చేయడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని మూడో పట్టణ సిఐ రామలింగప్ప హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని వైఎంకె నగర్‌లోని వడ్డీ వ్యాపారి యోగేష్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... పట్టణంలోని సాయిబాబా నగర్‌కు చెందిన వడ్డీ వ్యాపారి బసవరాజు సురేష్ లాల్ వద్ద మూడెకరాల పొలం మార్ట్ గేజ్ చేయించారని తెలిపారు. దీనికి రూ.1.80 కోట్ల మొత్తం తీసుకున్నారన్నారు. సురేష్ లాల్ ఇటీవల చనిపోయారని తెలిపారు. బసవరాజు మార్టగేజ్ చేయించిన పొలం సెల్ డిడి చేసుకున్నారని తేలడంతో సురేష్ లాల్ కుమారుడు యోగేష్‌ను నిలదీశారని చెప్పారు. యోగేష్, ఇతరులు బసవరాజుపై దాడికి పాల్పడినట్లు జూన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు కాగా డీఎస్పీ హేమలత ఆదేశాల మేరకు శుక్రవారం యోగేష్ ఇంటిపై సోదాలు నిర్వహించి పత్రాలను పరిశీలించామన్నారు. చట్ట విరుద్ధంగా వడ్డీ వ్యాపారాలు చేస్తూ అమాయకులను ఇబ్బందులకు గురి చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

చెత్త నుంచి సంపద సృష్టిద్దాం

- గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించండి - జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి

ప్రజాశక్తి - హోళగుంద

తడి, పొడి చెత్త నుంచి సంపద సృష్టిద్దామని, గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత మండల అధికారులపై ఉందని జడ్‌పి సిఇఒ నాసరరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని మార్లమడికి గ్రామంలో ఐవిఆర్ఎస్‌లో జీరో ఫర్మార్మెన్స్ ఉన్నందున సందర్శించి సదరు పంచాయతీ కార్యదర్శిపై మండిపడ్డారు. భవిష్యత్తులో ఇలాగే కొనసాగితే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వం అప్పజెప్పిన పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేస్తే మంచి పేరు వస్తుందన్నారు. అనంతరం హోళగుంద మండల పరిషత్ కార్యాలయంలో పంచాయత్ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. డిప్యూటీ ఎంపిడిఒ చక్రవర్తి, పంచాయతీ కార్యదర్శులు రంగస్వామి, రాజశేఖర్, మహ్మద్ షఫీ, రాజ్ కుమార్, నాగరాజు, ఉమామహేశ్వరి, నాగరాజు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న సిఇఒ నాసరరెడ్డి

రాలని చినుకు...

- ఎండుతున్న పంటలు - కరువు కోరల్లో రైతులు

ప్రజాశక్తి - దేవనకొండ

ఈఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వర్షాలు కురవడంతో రైతులు పంటలను సాగు చేశారు. ప్రస్తుతం చినుకు జాడ కనిపించకపోవడంతో పంటలు వాడుముఖం పట్టాయి. గత మూడేళ్లుగా ప్రకృతి వైపరీత్యాలతో రైతులు నష్టపోతూనే ఉన్నాయి. పంట దిగుబడుల కోసం పెట్టిన పెట్టుబడులు చేతికందక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

ఈ ఏడాది వ్యవసాయ ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో కురిసిన వర్షాలకు రైతులు ఆముదం, వేరుశనగ, పత్తి, టమోటా, కంది, చోలకాయ తదితర పంటలను సాగు చేశారు. మండలంలో పత్తి, వేరుశనగ, ఆముదం పంటలను రైతులు అత్యధిక విస్తీర్ణంలో సాగు చేశారు. పత్తి పంట సాగు చేసి రెండు నెలలు గడుస్తుండడంతో పూత, సట్టా, కాయతో ఏపుగా పెరిగాయి. గత 20 రోజుల నుంచి వర్షాలు కురవకపోవడంతో పత్తి పంట ఎండు దశకు చేరి వాడుముఖం పట్టాయి. పత్తి మొక్కకు పూసిన పూత, సట్టా, కాయ రాలిపోతున్నాయి. పత్తి పంట ఒక ఎకరా సాగుకు విత్తన, నాటు సేద్యాలు, కలుపు, క్రిమిసంహారక, రసాయనిక ఎరువుల ఖర్చులు ఎకరాకు

రూ.40 వేల దాకా పెట్టుబడులు పెట్టామని రైతులు వాపోతున్నారు. వర్షాలు కురవకపోవడంతో పంటల సాగు కోసం పెట్టిన పెట్టుబడులు కూడా చేతికందే పరిస్థితులు లేవు. హంద్రీనీవా కాలువలు లేని గ్రామాలైన గుడిమిరాళ్ల, బంటుపల్లి, చెల్లెల చెలిమల, బేతపల్లి, బండపల్లి, పి.కోటకొండ, దుప్పనగుర్తి, బుర్రకుంట, కె.వెంకటాపురం, పాలకుర్తి, తెర్నేకల్లులో మరో వారం రోజుల్లో వర్షాలు కురవకపోతే తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆ గ్రామాల రైతులు వాపోతున్నారు.

వర్షాలు కురవక పోతే నష్టపోతాం

- లింగన్న, ఐరన్ బండ బి సెంటర్

వారం రోజుల్లో వర్షాలు కురవక పోతే తీవ్రంగా నష్టపోతాం. పంటల కోసం పెట్టిన పెట్టుబడులు కూడా రాకపోవడంతో తీవ్రంగా నష్టపోతాం. ప్రస్తుతం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు.

19:19:19 ద్వారా పంటల రక్షణ

- ఎఒ ఉషారాణి

వర్షాలు లేక వాడుముఖం పట్టిన పంట పొలాలను 19:1919 మందుతో సంరక్షించుకోవాలి ఈ మందును పిచికారి చేసుకోవడం ద్వారా 10 రోజులపాటు పంటలను సంరక్షించుకోవచ్చు.

క్యూ ఆర్ స్కానర్లను పంపిణీ చేస్తున్న నాయకులు

అబద్ధాల్లో దిట్ట చంద్రబాబు : వైసిపి

ప్రజాశక్తి - కోసిగి

సాధ్యంకాని హామీలతో కూటమి ప్రభుత్వం ప్రజలను నట్టేట ముంచిందని, అబద్ధాలు చెప్పడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు దిట్ట అని వైసిపి జిల్లా కార్యదర్శి పి.మురళీ మోహన్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగి రెడ్డి ఆదేశాల మేరకు కామన్‌దొడ్డి గ్రామంలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' నిర్వహించారు. కామన్ దొడ్డి సర్పంచి ఈడిగ మునెమ్మ, ఎంపిపి ఈరన్న, నరసింహులు గౌడ్ ఆధ్వర్యంలో కూటమి మ్యానిఫెస్టో చూపించి ప్రజలకు వివరించారు.

భారీగా పెరిగిన హుండీ ఆదాయం

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీలక్ష్మీ నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి హుండీ ఆదాయం భారీగా పెరిగింది. శుక్రవారం శ్రావణ మాసపు మొదటి వారం హుండీని లెక్కించారు. దేవాలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు వివరాల మేరకు... స్వామివారికి రూ.1,22,88,424 నగదును భక్తులు చెల్లించుకున్నారు. ఇందులో రూ.1,15,99,609 నగదు, రూ.6,88,815 నాణేలు (చిల్లర) భక్తులు సమర్పించుకున్నారు. బంగారం 34 గ్రాముల 600 మిల్లీగ్రాములు, వెండి 23 కిలోల 230 గ్రాములు వచ్చాయి. గతేడాది శ్రావణమాసం కంటే రూ.84,18,411 అధికంగా వచ్చింది. ఆదోని గ్రూప్ దేవాలయ కార్య నిర్వాహణ అధికారి రాంప్రసాద్, భ్రమరాంబ సేవా సంఘం నిర్వాహకులు మణికంఠ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

- అదానీతో విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలి
- వామపక్ష నాయకులు

ప్రజాశక్తి- దేవనకొండ

పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలను తగ్గించాలని, వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్ల బిగింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, అదానితో జరిగిన విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలని సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.మద్దిలేటి శెట్టి డిమాండ్ చేశారు. ఈనెల 5న విద్యుత్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. శుక్రవారం సిపిఐ కార్యాలయంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది కాలంలో విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15,485 కోట్ల భారం ప్రజలపై మోపిందన్నారు. గృహాలకు స్మార్ట్ మీటర్లు బిగించేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గతంలో చంద్రబాబు నాయుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యుత్ చార్జీల పెంపుదలను తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తు చేశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకోవాలని.. అవసరమైతే పగలగొట్టాలని సూచించారని తెలిపారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రద్దు చేస్తామని, అక్రమంగా జరిగిన సోలార్ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేస్తామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చారని చెప్పారు. కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఐ మండల కార్యదర్శి ఎం.నరసరావు, సిపిఐ, సిపిఎం పట్టణ కార్యదర్శులు వి.రాజశేఖర్, ఎం.అశోక్, వ్యకాస మండల నాయకులు ఎస్ఎం.యూసుఫ్, ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి ఎం.రామాంజి, ఎఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి కె.భాస్కర్, ప్రజాసంఘాల నాయకులు అబ్బాస్, మద్దిలేటి, కోదండ, వెంకటేష్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వీర శేఖర్

మహారాజ శ్రీ కర్నూలు ఆదనపు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

ఐ.ఎ.నెం.7/2025 ఇన్ ఓ.యస్.నెం.184/2018

1.కె.అనిల్‌కుమార్
2.కె.ప్రవీన్‌కుమార్. ...అర్జీదారులు/వాదులు

-వర్సెస్-

యన్.రమేష్‌కుమార్ మరియు ఇతరులు.
...రెస్పాండెంట్లు/ప్రతివాదులు

నోటీసు టు రెస్పాండెంట్సు 4 టు 6 (యల్.ఆర్స్ ఆఫ్ డి.3)

ఆర్.4.యన్.భాగ్యలక్ష్మి భర్త లేటు యన్.సుబ్బయ్య,
ఆర్.5.యన్.ప్రవీన్‌కుమార్
తండ్రి లేటు యన్.సుబ్బయ్య,
ఆర్.6.యన్.ప్రత్యుష తండ్రి లేటు యన్.సుబ్బయ్య,
అందరి నివాసం.ఇంటి.నెం.45-4-172-డి-4,
రోడ్డు నెం.5, వెంకటరమణ కాలనీ, కర్నూలు సిటి.

పైన తెల్పిన వాదులు, లేటు యన్.సుబ్బయ్య (డి.3) యొక్క వారసులుగా మిమ్ములను చేర్చమని కోరుతూ పైన తెల్పిన అర్జీదారులు ఐ.ఎ.నెం.7/2025 గల అర్జీని పై కనబరచిన కోర్టులో అర్జీదాఖలు చేసినారు. సదరు విషయమై 4 నుండి 6 రెస్పాండెంట్లు అయిన మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 6-08-2025 వ తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు న్యాయవాది ద్వారా కాని హాజరై పై కోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదురు అర్జీని మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడ మైనది.

కోర్టు వారికోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా : 6-8-2025

కె.లోకేశ్వరరెడ్డి,
అర్జీదారుల పరం అడ్వకేటు, కర్నూలు.

IN THE COURT OF HON'BLE Prl.JUNIOR CIVIL JUDGE, KURNOOL DISTRICT, AT :: KURNOOL
O.S. No. 36 OF 2024

Between:
VEERAVALLI RAJA KUMARI
... PLAINTIFF
AND
YEDULA RANGA REDDY
And others
... DEFENDANTS

D-1 YEDULA RANGA REDDY, S/o Late Y.Nagi Reddy, Aged about 80 years, Occ: Business, R/o H.No.66/3, Kota, Kurnool City, Kurnool District, Andhra Pradesh.
D-2 JAINAB KHATHU, W/o Mohammed Hussian, Aged about 75 years, Occ: Housewife, R/o 17/12, Kota, Kurnool City, Kurnool District, Andhra Pradesh.
D-3 KHURSHID BEE, W/o Late Syed @ Basha, Aged about 50 years, Occ: Housewife, R/o H.No.15/137, Shariff Nagar, Kurnool City, Kurnool District, Andhra Pradesh.

The Plaintiff had filed the above suit for Declaration to title and Declaration of Registered Sale Deed bearing No.6067/2004 Dated 05.06.2004, as null and void and not binding on the Plaintiff and consequent relief of Perpetual Injunction. The Hon'ble Court was pleased to order for publication of this notice for your appearance in the above suit and the matter is posted to **02.09.2025** at 10.30 a.m. Therefore, you may appear before the Hon'ble Court either personally or through your authorized counsel or otherwise the matter will be adjudicated in due process of Law.

(BY ORDER OF THE COURT)

Sd/- B.JEEVAN KUMAR, D.RAVI KUMAR, D.SANDEEP KUMAR
Advocate,
Flat # 101, Padmavathi Plaza Apts.,
Chitralayaout Colony, R.R.Dist. Court,
L.B. Nagar, Hyderabad-500 074.
Ph.: 9959360060

ఈ నీరు తాగేదెలా..?

- కుళాయిలకు ఒండ్రు నీరు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో మున్సిపాలిటీ కుళాయి ద్వారా సరఫరా చేస్తున్న తాగునీరు రంగు మారి వస్తున్నాయి. నీరు ఒండ్రుతో ఉండడంతో తాగేదెలా అంటూ ప్రజలు వాపోతున్నారు. ఈ నీరు తాగితే కడుపునొప్పి, వికారం, వాంతులు, విరోచనాలు అయ్యే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుంచి ప్రజలకు తాగునీరు రోజుకు 20 మిలియన్ లీటర్ల నీరు సరఫరా అవుతోంది. తుంగభద్ర దిగువ కాలువపై తాగునీటికి ఆధారపడాల్సి ఉంది. ఇటీవల ఎమ్మెల్యే పార్థసారథి, మున్సిపల్ ఛైర్మన్ లోకేశ్వరి జలహారతి ఇచ్చి కాలువ నుంచి నీటి పంపింగ్‌కు చర్యలు చేపట్టారు. కాలువ నుంచి



పంపింగ్ చేస్తూ ఫిల్టర్ బెడ్ నుంచి నేరుగా ఓవర్‌హెడ్ ట్యాంకులకు నీటిని వదులుతున్నారు. నీరు రంగు మారి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు సైడ్ వాల్ కుంగడంతో మరమ్మతుల కోసం రూ.6 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. ట్యాంకులో 60 శాతం నీరు నిల్వ చేసుకోవచ్చని, కాలువ నుంచి నీరు పంపింగ్ చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తున్నామని అధికారులు చెబుతున్నారు. సుమారు 3,110 మిలియన్ లీటర్ల నీటి సామర్థ్యం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ఉంది. ట్యాంకులోకి నీరు పంపింగ్ చేసి నిల్వ ఉంచి ఎద్దడి రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని అధికారులు పేర్కొంటున్నారు. గత 15 రోజులుగా కుళాయి ద్వారా ఒండ్రుతో కూడిన నీరు వస్తుండడంతో తాగలేక ఫిల్టర్ నీరు కొనుగోలు చేసుకొని తాగుతున్నామని ప్రజలు చెబుతున్నారు. నీటిని శుభ్రంగా క్లోరినేషన్ చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు

వేడి చేసి తాగాలి

- కృష్ణ, మున్సిపల్ కమిషనర్

తుంగభద్ర డ్యాం నుంచి ఎల్ఎల్‌సికి విడుదల చేసిన కొత్త నీటిని ఎమ్మెల్యే, మున్సిపల్ ఛైర్మన్ ఆధ్వర్యంలో జలహారతి కార్యక్రమం నిర్వహించి నీటిని బసాపురం రిజర్వాయర్‌కు మళ్లించాం. పూర్తిగా అడుగంటిన జలాశయానికి నీరు వచ్చి చేరుతుండడంతో అడుగున ఉన్న ఒండ్రు మట్టి, నీటి పాకర కలిసి ఒండ్రుగా నీరు వస్తోంది. పట్టణ ప్రజలు నీటిని వేడి చేసి తాగాలి.

రూ.20లకే టెంకాయలు విక్రయించాలి

- డిప్యూటీ కమిషనర్ విజయరాజు

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీలక్ష్మీ నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రంలో రూ.20లకే భక్తులకు టెంకాయలు విక్రయించాలని ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు ఆదేశాలు జారీ చేశారు. టెండర్ నిబంధనలకు విరుద్ధంగా టెంకాయలు విక్రయిస్తున్నట్లు పత్రికల్లో రావడంతో శుక్రవారం ఆయన స్పందించారు. 'దోపిడీ అరికట్టలేరా స్వామి..!' అన్న శీర్షికన ప్రజాశక్తిలో ప్రచురించిన విషయం పాఠకులకు తెలిసిందే. భక్తులకు రూ.20లకే టెంకాయలు విక్రయించాలని టెంకాయల టెండర్ దక్కించుకున్న ప్రభుదేవాకు నోటీస్ ఇచ్చారు. అలాగే కల్యాణ కట్టలో గుండు గీయడానికి భక్తుల నుంచి రూ.100 అదనంగా వసూలు చేస్తున్నట్లు తెలియడంతో వారిని కూడా హెచ్చరించారు. రూ.40 చెల్లించి టికెట్ తీసుకున్న తర్వాత ఆ భక్తుని నుంచి డబ్బులు వసూలు చేయడం తగదన్నారు. ఈ విషయంపై కూడా సంబంధిత వారికి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. టెండర్ దారుని అత్యాశ వల్ల దేవాలయం కీర్తి, ప్రతిష్టలకు భంగం కలగడమే కాక, దేవస్థానంపై భక్తులకు వ్యతిరేక భావన ఏర్పడడం సహించరాని విషయమని చెప్పారు. అధిక ధరలకు విక్రయించినా, కల్యాణ కట్టలో డబ్బులు వసూలు చేసినా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

మెమోతో సరి..!

- ఫార్మాసిస్ట్, స్టాఫనర్సులకు మెమో

ప్రజాశక్తి - హోళగుంద

హోళగుంద ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాలం చెల్లిన మందులు రోగులకు అంటకడుతూ, వైద్యుడు వారి సిబ్బంది, రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ పత్రికల్లో ప్రచురితం కావడంతో డిఎంహెచ్ఒ డాక్టర్ శాంతి కళ స్పందించారు. ఆదోని డిప్యూటీ డిఎంహెచ్ఒ రఘురామి రెడ్డిని విచారణకు ఆదేశించారు. విచారణ చేపట్టిన డిప్యూటీ డిఎంహెచ్ఒ అసలు సూత్రధారి, డ్యూటీ డాక్టర్ న్యూటన్‌ను కాపాడేందుకు చిన్న ఉద్యోగులు ఫార్మాసిస్ట్, స్టాఫ్ నర్సులకు మెమో ఇచ్చి తప్పు మొత్తం వారే చేసినట్లు చూపించేలా పథకం రచించారు. ప్రధాన వైద్యుడికి కాలం చెల్లిన మందుల విషయంలో ఎటువంటి సంబంధమూ లేదని, ఆయనకు చాలా పనులు ఉన్నాయని, తప్పు మొత్తం వైద్య సిబ్బంది చేశారంటూ వారిపై నెట్టేశారు. ఆ వైద్య సిబ్బంది మాత్రం ఎవరో చేసిన తప్పునకు తమను బలి చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. జిల్లా అధికారులు విచారణను న్యాయబద్ధంగా చేస్తే ఎవరు తప్పు చేశారో తెలుస్తుందని పేర్కొన్నారు. ఈ విషయంపై డిప్యూటీ డిఎంహెచ్ఒ రఘురామి రెడ్డిని వివరణ కోరగా... కాలం చెల్లిన మందుల విషయంలో డాక్టర్ న్యూటన్ తప్పు లేదని, ఫార్మాసిస్ట్, స్టాఫ్ నర్సుల తప్పు ఉందని, అందుకే వారికి మెమో ఇచ్చమన్నారు.

జిల్లాస్థాయి యోగా పోటీలో బంగారు పతకాలు

ప్రజాశక్తి - ఆలూరు

జిల్లాస్థాయి యోగా పోటీలో ఆలూరు మోడల్ స్కూల్ విద్యార్థులు బంగారు, రజత పతకాలు సాధించినట్లు ప్రిన్సిపల్ ఆర్.రాఘవరావు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను శుక్రవారం ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడారు. జులై 31న జిల్లాలోని అవుట్‌డోర్ స్టేడియంలో జిల్లాస్థాయి యోగా పోటీలో యు-14 విభాగంలో 8వ తరగతి విద్యార్థులు సి.యువరాజు, ఎ.మహీధర్ బంగారు పతకాలు, కె.గౌస్ బాష రజతం సాధించారన్నారు. యోగా పోటీలో గెలుపొందిన విద్యార్థులు ఈనెల 3వ వారంలో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పాల్గొంటున్నట్లు తెలిపారు.

విద్యార్థులను అభినందిస్తున్న సిబ్బంది

పెండింగ్ గదులు పూర్తి చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సమస్యలు అడిగి తెలుసుకుంటున్న నాయకులు

పెండింగ్‌లో ఉన్న తరగతి గదులను పూర్తి చేయాలని సిపిఎం పట్టణ కమిటీ నాయకులు రాముడు, సురేష్, కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో శివనగర్ ఎంపిపి స్కూల్, ఆది ఆంధ్ర పాఠశాల, వీవర్స్ కాలనీ ఎంపిపి స్కూల్, సోగనూరు రోడ్డు జడ్‌పి హైస్కూల్, వీవర్స్ కాలనీ జడ్‌పి హైస్కూల్, ఎమ్మెస్ నగర్ జడ్‌పి హైస్కూల్ సమస్యలను పరిష్కరించాలని సర్వే చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తామని చెప్పి.. నిర్లక్ష్యం చేయడం వల్ల సమస్యలు పరిష్కారం కాక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని విమర్శించారు.

ముగిసిన పక్కీరప్ప తాత అంత్యక్రియలు

ప్రజాశక్తి - ఆస్పరి

లోబీపీతో మృతి చెందిన పక్కీరప్ప తాత మృతదేహాన్ని శుక్రవారం పల్లకిలో ఉంచి స్థానిక కర్నూలు రోడ్డు పక్కన ఉన్న పక్కీరప్ప తాత దేవాలయం ఆవరణంలో సమాధి చేయడంతో అంత్యక్రియలు ముగిశాయి. తాతను చూడడానికి ప్రజలు, శిష్యులు, భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS, AT :: VIJAYAWADA
Arbitration Claim Petition No. 185/2024

Between:-
Kapil Chits (Kosta) Pvt. Ltd,
Rep. By it's Assistant Divisional Manager,
Governorpeta Branch, Vijayawada.
...Disputant
And
Vempati Narasimha Rao & Others
...Opponents

Notice to Opponents 3, 4, 5 & 7

1. Suvvari Govinda Rao, S/o. Krishna Murthy, R/o. Q. No. E-10, Genco Colony, SLBHES, Eegalapenta, Srisailam, Kurnool District.
(Opponent No.3)
2. Billa Sandeep Kumar, S/o. Anand, Assistant Engineer, Employee ID No. 01076082, TS GENCO, Srisailam Left Bank, Srisailam, Kurnool District.
(Opponent No.4)
3. Vinjamuri Ramesh Babu, S/o. Shantha Kumar, R/o Q. No: G-233, B. Colony, NTTPS, Ibrahimpatnam, NTR District.
(Opponent No.5)
4. Chekuri Ramesh, S/o. Eswara Rao, R/o. D. No: 33-124/5, New B Colony, Ud/Ld 460 VTPS, Ibrahimpatnam, NTR District
(Opponent No.7)

Please take notice that the above Claim Petition had filed for recovery of claim amount and the Honourable Deputy Chit Registrar ordered notice to all of you and posted the case to 22-08-2025 for your appearance. So all of you are here by requested to appear before the office of Honourable Deputy Registrar of Chits Vijayawada, D. No. 55-6-7A, Opposite to Priya Childeren Hospital, Pantakaluva Road, Maruthi Colony, Patamata, Vijayawada- 520010 on 22-08-2025 at 11-30 A.M. in person or through your Advocate, failing which the matter will be decided in your absence.

(By order of the Honourable Deputy Registrar)

Hearing Date: 22-08-2025

A. Prasoon Kumar,
Advocate
Vijayawada

పేదలకు అండగా చంద్రన్న : టిడిపి

ప్రజాశక్తి - నందవరం

పేదలకు పింఛన్లు అందించి వారి కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు అండగా నిలిచారని టిడిపి నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మాధవరావు దేశాయ్ ఉదయం నుంచే పింఛన్ల పంపిణీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ... ఇచ్చిన మాట ప్రకారం పింఛను ఒకేసారి పెంచి ఇచ్చామని తెలిపారు. గ్రామంలో కొత్తగా 23 పింఛన్లు మంజూరు చేశామని చెప్పారు. జడ్‌పి మాజీ వైస్ ఛైర్మన్ పుష్పావతి పింఛన్ల పంపిణీని చేపట్టారు. టిడిపి మండల కన్వీనర్ ఖాసీంవలీ, జనసేన ఎల్లప్ప, గ్రామ అధ్యక్షులు భీమశేఖర్, గిర్ని ఈషా, భీమేష్, బూత్ కన్వీనర్ జగదీశ్, టిడిపి కార్యకర్తలు నలంగి మలప్ప గౌడ్, రహిమాన్ బాష, నాగరాజ్, రఫీ, సుభాన్, డీలర్ చాకలి మల్లికార్జున, తెలుగు ఈరన్న, చాకలి వెంకటేష్, గడ్డం చంద్ర, వలీ, చాకలి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణలో భాగస్వాములు కావాలి : ఎంపిడిఒ

ప్లాస్టిక్ నియంత్రణలో ప్రజలు భాగస్వాములు కావాలని ఎంపిడిఒ పుల్లయ్య తెలిపారు. ఆయన హాలహర్వి గ్రామంలో పింఛన్ల పంపిణీ చేపట్టారు. అనంతరం ఎంపిడిఒ, డిప్యూటీ ఎంపిడిఒ సందీప్ పరిసరాల పరిశుభ్రతపై, ఆరోగ్య భద్రతపై గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. చెత్త ఎక్కడ పడితే అక్కడ వేయరాదని, ఇంటి దగ్గరకొచ్చే పంచాయతీ కార్మికులకు అందించాలని తెలిపారు. సర్పంచి తిమ్మప్ప, పంచాయతీ కార్యదర్శి సుజాత, గ్రామ పెద్దలు దావీదు, జయరాజు, దాసు పాల్గొన్నారు.

చిప్పగిరి మండలం నేమకల్లు గ్రామంలో టిడిపి మండల కన్వీనర్ లాయర్ షేక్షావలీ, టిడిపి సీనియర్ నాయకులు పాముల సన్నప్ప, సంగాల భాస్కర్, పంచాయతీ కార్యదర్శి బాలన్న ఆధ్వర్యంలో పింఛన్లను పంపిణీ చేశారు. ఒక్క నేమకల్లు పంచాయతీకి 15 వితంతు పింఛన్లు వచ్చాయన్నారు. టిడిపి నాయకులు మేకల లక్ష్మీనారాయణ, కాంట్రాక్టర్ సుంకన్న, సునీల్, సుధా, చరణ్, విజయ్, ముక్క పాల్గొన్నారు. **దేవనకొండ** పంచాయతీ కార్యాలయ ఆవరణలో పింఛన్లు పంపిణీ చేశారు. మాజీ ఎంపిటిసి ఆకుల వీరేష్, సర్పంచి భర్త మాల బండ్లయ్య, టిడిపి జిల్లా కార్యదర్శి సభ్యులు మాలిక్ బాష, టిడిపి మండల నాయకులు బడిగింజల రంగన్న, తెలుగు యువత ఆలూరు అధ్యక్షులు రాజా సాబ్, పట్టణ అధ్యక్షులు మస్తాన్, పంచాయతీ, రెవెన్యూ కార్యదర్శులు రఫీ, కౌలుట్ల, టిడిపి టౌన్ వైస్ ప్రెసిడెంట్ కుక్కల తిమ్మయ్య, కూటమి నాయకులు కటిక ఉచ్చీరప్ప, వీరయ్య, గోవిందు, రంగన్న పాల్గొన్నారు. **హోళగుంద** మండలంలో పింఛన్లు పంపిణీ చేశారు. తెలుగు యువత రాష్ట్ర మాజీ కార్యదర్శి చిన్నహ్యాట శేషగిరి, మండల కన్వీనర్ తిప్పయ్య, బిజెపి నాయకులు చిదానంద ఆధ్వర్యంలో స్థానిక బీసీ బుడబుక్కల, బుడగ జంగాల కాలనీలో పింఛన్లు పంపిణీ చేశారు. **మంత్రాలయం** మండలం చెట్నిహళ్లి గ్రామంలో టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి ఆదేశాల మేరకు పింఛన్లు పంపిణీ చేశారు. మంచాల సొసైటీ డైరెక్టర్ చెట్నిహళ్లి చేపల నాగేష్, సర్పంచి ఆంజినేయులు, ఎంపిటిసి రామాంజనేయులు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లు అందజేశారు. గ్రామ కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు. అలాగే టిడిపి నాయకులు మంచాల సొసైటీ డైరెక్టర్ డిసి.తిమ్మప్ప, అశోక్ రెడ్డి, కమ్మరి నరసింహులు, రాఘవేంద్ర, శివకుమార్ లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లు అందజేశారు. నాయకులు ఇర్మియా పాల్గొన్నారు.

నందవరంలో పింఛన్లు అందిస్తున్న టిడిపి నాయకులు

చిప్పగిరిలో పింఛన్లు అందిస్తున్న టిడిపి నాయకులు

దేవనకొండలో పింఛన్లు అందిస్తున్న టిడిపి నాయకులు

మంత్రాలయం

మహారాజ శ్రీ కర్నూలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

ఓ.యస్.నెం.1656/2019

జి.శ్రీనివాసరావు. ...వాది

-వర్సెస్-

కె.సురేష్ కుమార్. ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్లు

కె.సురేష్ కుమార్ తండ్రి కె. రామచంద్రయ్య రావు,
వ్యాపారం, ప్లాట్ నెం. 101, విజయ లక్ష్మి
అపార్ట్‌మెంట్స్, చానిక్యపురి కాలని,
అయ్యప్ప స్వామి టెంపుల్ దెగ్గర,
సప్తగిరి నగర్, కర్నూలు.

పై నంబరు దావాలోవాది, ప్రతివాది నుండి దావా మొత్తము రూ. 4,00,000/-, ముందు వడ్డి, కోర్టు ఖర్చులు రాగోరి దావా దాఖలు చేసినాడు. ఇందులో ప్రతివాది అయిన నీకు ఆక్షేపణ ఉన్న 11-8-2025 తేది పగలు 10.30 గంటలకు మీరుకాని మీ తరపున అడ్వకేటు ద్వారా గాని పై కోర్టులో హజరె పై కోర్టులో హజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకొనవలయును. లేని యెడల సదరు దావా నీ పరోక్షమున విచారించి తీర్మానింపబడును.

కోర్టు వారి ఉత్తర్వు మేరకు

వాయిదా : 11-08-2025

జి. నాగరమేష్,
ఎ.ఒ. జయశ్రీ,
వాదిపరం అడ్వకేట్లు,
కర్నూలు.

పోలీసు ఉద్యోగాలకు యువకులు



ఎంపికైన యువకులు

పోలీసు ఉద్యోగాలకు తెర్నేకల్ యువకులు

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని తెర్నేకల్ గ్రామానికి చెందిన ఆరుగురు యువకులు పోలీసు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. శుక్రవారం వెలువడిన కానిస్టేబుల్ పరీక్ష ఫలితాల్లో గ్రామానికి చెందిన ఎరుకుల రాజశేఖర్, బెస్త వీరశేఖర్, కురువ గురుస్వామి, చాకలి వీరన్నలు ఎపిఎస్‌పికి, వడ్డే రవితేజ, పైఇంటి మహేష్ సివిల్‌కు ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన ఆరుగురు యువకులు ఒకేసారి కానిస్టేబుల్‌గా ఎంపిక కావడం పట్ల సర్పంచి మొగతాల్ అరుణ్ కుమార్ అభినందనలు తెలిపారు. అలాగే దేవనకొండ గ్రామానికి చెందిన ఇదయతుల్లా సివిల్, బాష ఎపిఎస్‌పి, కె.వెంకటాపురం గ్రామానికి చెందిన గొల్ల వంశీ సివిల్ పోలీసు ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

కోసిగిలో 13 మంది

కోసిగి : మండలం నుంచి 13 మంది యువకులు కానిస్టేబుల్ ఫలితాల్లో పోలీసు కొలువులు సాధించడంతో మండల ప్రజలతో పాటు అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కోసిగిలో ఐదుగురు యువకులు హనుమంతు రెడ్డి, శ్రీరాములు, రవిశంకర్ (సివిల్), సత్యరాజ్, సి.రాజశేఖర్ (ఎపిఎస్‌పి) పోలీసులుగా ఎంపికయ్యారు. అలాగే మండలంలోని జంపాపురం గ్రామానికి చెందిన ఉమా శంకర్, ఉస్మాన్ ఘని (ఎపిఎస్‌పి), దుద్ది గ్రామానికి చెందిన శేఖర్ (సివిల్), గురుస్వామి, కోల్మన్ పేటకు చెందిన బండారి తాయన్న, అగసనూరుకు చెందిన బారికి శంకర్, వందగల్లుకు చెందిన రాజశేఖర్ (ఎపిఎస్‌పి), సజ్జలగూడేనికి చెందిన మహాలింగ (ఎపిఎస్‌పి) కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు.

కానిస్టేబుల్ ఉద్యోగాలకు నందవరం యువకులు

నందవరం : కానిస్టేబుల్ ఉద్యోగాలకు నందవరం గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు ఎంపికయ్యారు. చెంచు బోయ రాంబాబు ఎపిఎస్‌పి 123, తెలుగు అనిల్ ఎపిఎస్‌పి 133, ఫయాజ్ సివిల్ 133 మార్కులతో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరి ఎంపిక పట్ల శుక్రవారం గ్రామస్తులు అభినందనలు తెలిపారు. యువకుల తల్లిదండ్రులు, బంధువులు హర్షం వ్యక్తం చేశారు.

రైతు కుటుంబం నుంచి పోలీసు ఉద్యోగాలు

ఆస్పరి : మండలంలోని పలు గ్రామాల యువకులు పోలీసు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఆయా గ్రామాల నుంచి ఎంపికైన యువకులను గ్రామస్తులు అభినందించారు. శుక్రవారం ప్రభుత్వం విడుదల చేసిన కానిస్టేబుల్ పోస్టులకు మండలంలోని ములుగుందం గ్రామానికి చెందిన కోతి బోయ చిన్న ఈరన్న, లక్ష్మి దంపతుల కుమారుడు కోతి బోయ శంకర్ (ఎపిఎస్‌పి)

కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. డి.కోటకొండ గ్రామానికి చెందిన దూదేకుల ఉసేనప్ప, దానమ్మల చిన్న కుమారుడు దూదేకుల అజహార్ వలీ (ఎపిఎస్‌పి), అదే గ్రామానికి చెందిన దాసరి వెంకటేష్, లక్ష్మి దంపతుల కుమారుడు దాసరి మహేష్ (ఎపిఎస్‌పి), కారుమంచి గ్రామానికి చెందిన కురువ చిన్న రంగన్న, లక్ష్మి దంపతుల కుమారుడు కురువ వీరాంజనేయులు (సివిల్), నగరూరు గ్రామానికి చెందిన దుర్గప్ప గారి నరసింహులు, లక్ష్మీదేవిల దంపతుల కుమారుడు తరుణ్ (ఎపిఎస్‌పి), అదే గ్రామానికి చెందిన గుడిసె మల్లేష్, రామాంజినమ్మ దంపతుల కుమారుడు గుడిసె నాగభూషణం (ఎపిఎస్‌పి) కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు.

డార్మెటరీ హాలు ప్రారంభోత్సవానికి సిద్ధం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామి మఠం ఆధ్వర్యంలో నిర్మించిన డార్మెటరీ హాలు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. శ్రీమఠం నిర్వహణలో ఉన్న బృందావన గార్డెన్ పక్కన ఉన్న వృథాగా ఉన్న స్థలంలో పీఠాధిపతులు దృష్టి సారించి భక్తుల సౌకర్యార్థం శ్రీమఠం నిధులతో నిర్మించిన డార్మెటరీ హాలును నిర్మించారు. ఈనెల 8 నుంచి 14 వరకు జరగనున్న శ్రీరాఘవేంద్రస్వామి ఆరాధన మహోత్సవాల సందర్భంగా అందుబాటులోకి రానుంది. సుమారు 150 మంది భక్తులకు విడిది ఏర్పాటు చేసే విధంగా నిర్మాణం చేపట్టారు. డార్మెటరీ హాలులో ఫ్యాన్‌లతో పాటు మహిళలకు 4, పురుషులకు 4 చొప్పున అటాచ్డ్ బాత్ రూమ్స్ ఏర్పాటు చేశారు. శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ఇప్పటికే చేపట్టిన పనుల నేపథ్యంలో మంత్రాలయం మరింత అభివృద్ధి వైపు వేగంగా అడుగులు వేస్తుంది.

పోలీసు ఉద్యోగం సాధించిన యువతి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్


తల్లిదండ్రులతో ఉన్న జయలక్ష్మి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పోలీస్ రిక్రూట్మెంట్ ఫలితాల్లో ఆదోని మండలం ధణాపురం గ్రామానికి చెందిన పేదింటి యువతి సిఆర్.జయలక్ష్మి పోలీసు కానిస్టేబుల్‌గా ఎంపియ్యారు. శుక్రవారం విడుదల చేసిన ఫలితాల్లో జయలక్ష్మి 130 మార్కులు సాధించి సివిల్‌కు ఎంపికయ్యారు. గ్రామంలో వారి తల్లిదండ్రులు సాధారణ కూలీ కుటుంబానికి చెందినవారు. తండ్రి సిఆర్.షణ్ముఖ, తల్లి మంగమ్మ. కుటుంబంలో ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. జయలక్ష్మి చిన్న కుమార్తె. జయలక్ష్మి పట్టుదలతో చదివి ఈ ఘనత సాధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన జయలక్ష్మి రాష్ట్ర ప్రభుత్వ నోటిఫికేషన్‌కు అనుగుణంగా నిర్వహించిన నియామక పరీక్షల్లో ప్రతిభ కనబరిచారు. కుటుంబ సభ్యులు, బంధువులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, టిడిపి సీనియర్ నాయకులు, ఎస్ఎంసి ఛైర్మన్ సిఆర్.రాఘవేంద్ర హర్షం వ్యక్తం చేశారు.

సారాను సమూలంగా నిర్మూలిస్తాం

- ఎక్సైజ్ సిఐ సైదుల్

ప్రజాశక్తి - ఆదోని

సారా స్థావరాలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

నాటుసారాను సేవించి చాలామంది అనారోగ్యం పాలవుతున్నారని, సారాను సమూలంగా నిర్మూలించేందుకు క్షేత్రస్థాయిలో స్థావరాలను ధ్వంసం చేస్తున్నామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ సైదుల్ తెలిపారు. నవోదయం 2.0లో భాగంగా శుక్రవారం శివారు కొండల్లోనూ, ఇస్వి చెరువు సమీపంలోనూ దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాటసారా స్థావరాలను గుర్తించి 450 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేసి 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆదోనిలోని బోయ గేరికి చెందిన బోయ చిన్న రంగను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. నాటుసారా కేసుల్లో పట్టుబడిన పాత నేరస్తులు బోయ గేరికి చెందిన బోయ ఈరన్న, వాల్మీకి రాము, నాటుసారా కేసులతో సంబంధం ఉన్న బెల్లం వ్యాపారులు ఓబులేసు, గురురాజును ఆదోని తహశీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్లు చెప్పారు. నాటు సారా, కర్ణాటక మద్యం అమ్మినా, రవాణా చేసినా వారిపై పీడీ చట్టం కింద కేసులు నమోదు చేసి జిల్లా బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు.

స్థాయి సంఘ సభ్యుల నియామకం పూర్తి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరపాలక సంస్థ స్థాయి సంఘం ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన సభ్యులకు కమిషనర్ పి.విశ్వనాథ్ నియామక పత్రాలు అందజేశారు. శుక్రవారం నగరపాలక కార్యాలయంలో మేయర్ బివై. రామయ్య, కమిషనర్ చేతుల మీదుగా సభ్యులు డిక్లరేషన్ ఫాంలను అందుకున్నారు. నూతన సభ్యులకు మేయర్, కమిషనర్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, కార్పొరేటర్ క్రిష్ణకాంత్, తదితరులు పాల్గొన్నారు. ఎన్నికైన సభ్యులు. అహమ్మద్ షేక్ – 50వ వార్డు , నారాయణరెడ్డి, ఇప్పల – 28వ వార్డు , మునెమ్మ కురువ – 43వ వార్డు , వెంకటేశ్వర్లు వై. – 34వ వార్డు, సాంబశివ రావు చేన్నబోయిన – 39వ వార్డు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి : ఎంఎస్‌పి

ప్రజాశక్తి - ఆదోని

ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మాదిగలు అందిపుచ్చుకోవాలని ఎంఎస్‌పి జిల్లా అధికార ప్రతినిధి బండారి హనుమంతు కోరారు. శుక్రవారం ఆదోని కౌడల్ పేటలో ఎంఆర్‌పిఎస్ టౌన్ కన్వీనర్ మణికంఠ మాదిగ, కో కన్వీనర్ జిఎస్.దత్తు మాదిగ, వార్డు నాయకులు సురేంద్ర మాదిగ అధ్యక్షతన నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా హనుమంతు మాట్లాడారు. వార్డుల్లో ఎంఆర్‌పిఎస్ జెండావిష్కరణ చేయిస్తామన్నారు. 30 ఏళ్ల ఎస్సీ వర్గీకరణ పోరాటం కల ఫలితం నెరవేరి ఏడాది అయిందని తెలిపారు. ఎంఆర్‌పిఎస్ జిల్లా ఇన్‌ఛార్జ్ పి.మనోజ్ మాదిగ, భీమప్ప మాదిగ, నియోజకవర్గ కో ఇన్‌ఛార్జి బండారి గిడ్డయ్య మాదిగ, ఎంఆర్‌పిఎస్ ఆదోని పట్టణ ఇన్‌ఛార్జ్‌లు మాదాసు జగన్ మాదిగ, గుమ్మల బాలస్వామి మాదిగ ఉన్నారు.

మాట్లాడుతున్న బండారి హనుమంతు మాదిగ

విరాళాలు సేకరిస్తున్న నాయకులు

క్యూబా సహాయార్థం నిధి సేకరణ

ప్రజాశక్తి - కౌతాళం

క్యూబా దేశ ప్రజల కోసం రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సహాయ నిధి సేకరణ చేపట్టారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య మాట్లాడుతూ... క్యూబాపై అమెరికా విధించిన ఆంక్షలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఆ దేశ ప్రజల కోసం ప్రతి ఒక్కరూ విరాళాలు అందించి వారి కష్టాల్లో పాలుపంచుకోవాలని కోరారు. మండల కన్వీనర్ ఈరన్న, వీరేష్, వలీ పాల్గొన్నారు.

రోడ్డుపై గుంత పూడ్చివేత

- ప్రజాశక్తి కథనంతో సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - నందవరం

రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంతను అధికారులు పూడ్చివేశారు. ప్రజాశక్తి ప్రచురించిన 'నడిరోడ్డుపై గుంత' కథనానికి అధికారులు స్పందించారు. నందవరం బస్టాండ్ ప్రాంతంలో నాగలాదిన్నె వెళ్లే రహదారిలో సిసి రోడ్డుపై భారీ గుంత ఏర్పడింది. గత 8 నెలలుగా గుంత వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి గుంతను పూడ్చివేశారు. గుంత వల్ల వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడేది. రైతులు పొలాలకు వెళ్లే సమయంలో ఎద్దుల బండ్లతో కష్టాలు పడేవారు. చాలా సందర్భాల్లో వాహనాలు గుంతలో పడిపోయేవి. ప్రస్తుతం సమస్య పరిష్కారం కావడంతో శుక్రవారం ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించడంలో కీలక పాత్ర పోషించిన 'ప్రజాశక్తి'కి ధన్యవాదాలు తెలిపారు. అదే ప్రాంతంలో రోడ్డు పగిలి డ్రెయినేజీ అస్తవ్యస్తంగా మారింది. దాని వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ సమస్యను కూడా త్వరగా పరిష్కరించాలని ప్రజలు కోరారు.

రోడ్డుపై పూడ్చిన గుంత